క్లుప్తంగా

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేం చేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృతాలతో ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ రామరత్నచార్యులు శిష్యబృందం అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, తులసీ దళ అర్చన, పంచ హారతుల సేవ నిర్వహించారు. ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు నగరంలో టాయ్ గ్రంథాలయం ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యాన ఏప్రిల్ 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు పిల్లల కోసం టాయ్ లైబ్రరీని ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయం కార్యదర్శి డాక్టర్ రావి శారద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీముఖి అనుమోలు ఈ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తారని, ఇందులో 12 ఏళ్లలోపు చిన్నారుల కోసం 25 రకాల ఇండోర్ గేమ్స్ ఉచితంగా టాయ్స్ రూపంలో ఉంచనున్నామన్నారు. డ్రాప్ గేమ్, స్టార్ గేమ్, కలర్ ఫుల్ గేమ్, గో ఫ్రాగ్గీ గో గేమ్, రైడ్ విత్ రామ, క్యాచ్ ఏ ఫిష్ తదితర గేమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. నగరంలో తొలిసారి వినూత్నంగా ప్రారంభించనున్న కార్యక్రమానికి తల్లిదండ్రులు పిల్లలను వెంటబెట్టుకొని రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రూ.1.17 లక్షల సిగరెట్లు స్వాధీనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అనుమతులు లేని సిగరెట్లు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి రూ.1.17 లక్షల విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకున్న సంఘటన వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ మొయిన్ బజార్ సమీపంలోని ఇమామ్ పంజా వీధిలోని శ్రీ వాసవీ మార్కెట్‌లో శ్రీనివాస క్లాత్ సెంటర్ దుకాణ యజమాని పేర్ల హరిప్రసాద్, జై భారత్ మార్కెట్‌లోని శ్రీ సాయి ట్రేడర్స్ యజమాని గొంట్ల బాలాజీ గిరిధర్ అనుమతులు లేని సిగరెట్లు విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారమందింది. స్థానిక ఎస్‌ఐ సరళ ఆ దుకాణాలపై దాడి చేసి సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి దశ నుంచే పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థి దశ నుంచే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల అండ్ జనరల్ హాస్పిటల్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ప్రభాదేవి చెప్పారు. జాతీయ పోషకాహార మిషన్ (పోషణ్ అభియాన్)లో భాగంగా స్థానిక వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో పోషకాహార ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహనా సదస్సు పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగింది. ప్రభాదేవి హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చునని చెప్పారు.

అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు

- జక్కంపూడి కాలనీలో కంటి మీద కనుకు కరువు
- బుడమేరుతో దోమలు, దుర్గంధం
- రెండు నెలలుగా పేరుకుపోయిన వ్యర్థాలు
- శుభ్రం చేయాలంటున్న కాలనీ వాసులు



కాల్వలో పేరుకుపోయిన నాచు, వ్యర్థాలు



వ్యర్థాలతో నిండిన బుడమేరు కాలువ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి కాలనీ వాసులకు బుడమేరు కాల్వ కంటి మీద కనుకు లేకుండా చేస్తుంది. కాలనీ మధ్య నుంచి సుమారు అర కిలో మీటరు మేర ప్రవహించే బుడమేరు కాల్వను శుభ్రం చేసే వారు లేక భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. ఇక చీకటి పడితే చాలు కాల్వ నుంచి వచ్చే దోమలతో ఇంటి ముంగిట కూడా ఉండే పరిస్థితి లేదు. రెండు నెలలుగా బుడమేరు కాల్వ పరిస్థితి ఇదే రీతిలో ఉన్న కార్పొరేషన్ శానిటేషన్, మలేరియా విభాగం కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి నోచని బుడమేరు

గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన బుడమేరు వరదతో కాల్వలో పూడిక పేరుకుపోయింది. వరదతో కొట్టుకు వచ్చిన మట్టి, ఇసుకతో కాల్వ ఎత్తు పల్లాలుగా మారిపోయింది. దీంతో కాల్వలో ఎక్కడికక్కడి నీరు నిలిచి పోయి నాచు పేరుకుపోవడం, చుట్టు పక్కల ఇళ్లలో నుంచి వచ్చే వర్థాలు ఆ నీటిలో వేయడంతో భరించలేని దుర్వాసన వస్తున్నట్లు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. బుడమేరు వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కాలనీ దిగువన, సీఎన్‌జీ గ్యాస్ బంక్ స్టేషన్ సమీపంలో కాల్వను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. అయితే కాలనీలోని కాల్వను ఏ ప్రాంతం అభివృద్ధి చేయకపోవడంతో స్థానికులకు కష్టాలు తప్పడం లేదు.

డంపింగ్ యార్డ్‌గా బుడమేరు కాల్వ

కాలనీ మధ్య నుంచి ప్రవహిస్తున్న బుడమేరు కాల్వను స్థానికులతో పాటు శానిటేషన్ సిబ్బంది డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. వీధులను శుభ్రం చేసిన మట్టి, వ్యర్థాలతో పాటు స్థానికులు పనికి రాని సామగ్రి వేసేందుకు బుడమేరు కాల్వను ఎంచుకుంటున్నారు. దీంతో కాల్వలో పలు చోట్ల చెత్త పేరుకుపోయింది. కనీసం ఇప్పటికైనా కాల్వను శుభ్రం చేయడంతో పాటు కాల్వలో చెత్త వేయకుండా స్థానికులకు అవగహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చీకటి పడితే దోమలు

కాల్వ చుట్టు పక్కల నివాసం ఉండే బ్లాకులలో సాయంత్రం ఆరు దాటితే దోమలతో సహావాసం చేయాల్సి వస్తుందంటున్నారు. ఇంట్లో ఉందామంటే దోమల బెడద, ఇంటి బయటకు వద్దామంటే దుర్వాసన భరించలేకుండా ఉన్నామంటున్నారు. కాల్వలో దోమల లార్వా వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన



మహామండపం ఎదుట నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న టెక్నికల్ బృందం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను టెక్నికల్ బృందం మంగళవారం పరిశీలించింది. ఇంద్రకీలాద్రిపై పూజా మందిరం, అన్నదాన భవనం, ప్రసాదాల పోటు, క్యూలైన్ కాంప్లెక్స్ పనులను చేపట్టింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న పూజా మండపాలు పనులు దాదాపు పూర్తి కావస్తుండగా, అన్నదానం, ప్రసాదాల పోటు భవనాలు కీలక దశకు చేరుకున్నాయి. దీంతో దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్రమోహన్, మాస్టర్ ప్లాన్ ప్రధాన సలహాదారు కొండలరావు, దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ శేఖర్, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను పరిశీలించిన టెక్నికల్ బృందం ఆలయ ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. హెడ్ వాటర్ వర్క్స్ ఎదుట రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణంపై టెక్నికల్ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసింది.

వీఎంసీ ఆధ్వర్యంలో వేసవి ఉచిత క్రీడా శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ ఏడాది మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వేసవి ఉచిత క్రీడా శిక్షణ అందిస్తున్నామని, స్విమ్మింగ్‌పూల్స్, ఇండోర్ స్టేడియం, స్కేటింగ్ రింక్‌లలో శిక్షణ ఇస్తామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్విమ్మింగ్‌కు గాంధీనగర్‌లోని సర్‌విజ్జి స్విమ్మింగ్‌పూల్, గురునానక్‌లోని స్విమ్మింగ్ పూల్, చిట్టినగర్‌లోని డాక్టర్ కేఎల్‌రావు స్విమ్మింగ్‌పూల్‌ల్లో శిక్షణ ఇస్తామన్నారు. బ్యాడ్మింటన్‌కు ఎంజీ రోడ్డులోని దండమూడి రాజగోపాలచారి ఇండోర్ స్టేడియం, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో, స్కేటింగ్‌కు దండమూడి రాజగోపాలాచారి ఇండోర్ స్టేడియంలో, సత్యనారాయణపురంలోని జీవీఎస్ శాస్త్రి పార్కులో, భవానీపురంలోని రోజ్ గార్డెన్ పార్కులో శిక్షణ ఇస్తామని తెలిపారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో యోగాలో కూడా శిక్షణ అందిస్తారని, ఆయా క్రీడలు, ఆటల్లో శిక్షణ పొందాలనుకున్న అభ్యర్థులు ఎలాంటి ఫీజు లేకుండా ఆయా స్టేడియాల్లో, శిక్షణ ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంచుకున్న క్రీడలకు సంబంధించి దుస్తులు, క్రీడా పరికరాలు సొంతంగా సమకూర్చుకోవాలని సూచించారు.

బెంగళూరులో వీఎంసీ కార్పొరేటర్లు



బెంగళూరు కార్పొరేషన్‌లో వీఎంసీ కార్పొరేటర్లు, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ కార్పొరేటర్లు విజ్ఞాన యాత్రలో మొదటి రోజు బెంగళూరులోని కే 100, వైట్ టాప్ రోడ్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. బృహత్ బెంగళూరు మహానగర పాలికే(గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్)లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేశారు. బీబీఎంసీలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విజయవాడ కార్పొరేటర్లకు ఆహ్వానం పలికిన బీబీఎంసీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సవాళ్లు, కార్పొరేషన్ స్థితిగతులను వివరించారు. బెంగళూరులో 225 చదనపు కిలోమీటర్లతో మొదలైన బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రస్తుతం 700 చదనపు కిలోమీటర్ల విస్తరణలో, కోటి నలభై ఒక లక్షల జనాభాతో, గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్‌గా 8 జోన్‌లతో అభివృద్ధి చెందిందని కమిషనర్ తుషార్ గిరినాథ్ తమకు వివరించారని వీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యనారాయణ తెలిపారు.

క్లైమేట్ యాక్షన్ ప్లాన్ నిర్వహణ..

25 నుంచి 30 ఏళ్ల వరకు ఎలాంటి నిర్వహణ ఖర్చు లేకుండా ఉండే వైట్ టాప్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారని, ప్రస్తుతం బెంగళూరు నగరంలో 200 కిలోమీటర్ల వరకు వైట్ టాప్ రోడ్లు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయని డెప్యూటీ మేయర్ అవుతుశైలజ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో మురుగునీటి పారుదలకు సంబంధించి కే 100 ప్రాజెక్టుని ప్రస్తుతం చేపడుతున్నట్లు చెప్పారన్నారు. కోరమంగళ వ్యాలీ నుంచే మొదలై 100 కిలోమీటర్ల వరకు ఉన్న ఈ ప్రాజెక్టుకు ఓ100 స్ట్రామ్ వాటర్ డ్రైన్ ప్రాజెక్ట్ సంబంధిత ప్రాజెక్ట్ అన్నారు. కే 100 ప్రాజెక్ట్‌లో భాగంగా సహజ పద్ధతిలో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌లో కాలుష్యాన్ని కాలవలో పెరిగే మొక్కల ద్వారా తగ్గిస్తూ నీటి శుద్ధత చేస్తున్నారని చెప్పారు. కేవలం వర్షపు నీటి డ్రెయిన్ మాత్రమే కాకుండా పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అక్కడ అందిస్తున్నారన్నారు. భారతదేశంలోనే క్లైమేట్ యాక్షన్ ప్లాన్ నిర్వహించడంలో బెంగళూరు 3వ నగరమని చెప్పారు. అందులో భాగంగా పర్యావరణం, సరస్సులు, అభివృద్ధి పరుస్తున్నారని, గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్యంగా నాలుగు సవాళ్లు ఎదుర్కొంటుందన్నారు. అవి వ్యర్థాలు, రోడ్లు, లైటింగ్, సరస్సులని కమిషనర్ తమకు వివరించారని డెప్యూటీ మేయర్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి గాలి నాణ్యత సరస్సులలో నీటి సాంద్రత, వెహికల్ ట్రాకింగ్ వంటి అంశాలు నిర్వహిస్తారని చెప్పారు.

చెక్క సామగ్రికి కేరాఫ్ పూర్ణానందంపేట





విజయవాడ నగరంలో చెక్క సామగ్రికి కేరాఫ్ పూర్ణానందంపేటగా నిలుస్తోంది. చెక్కతో తయారు చేసిన మంచాలు, టేబుల్స్, కుర్చీలు, బల్లలు, పీటలు, చిన్న పిల్లలు నడక నేర్చుకోవడానికి అవసరమైన మూడు చక్రాల బండ్లు ఇక్కడ లభిస్తాయి. ప్రస్తుతం అన్ని వస్తువులు రెడీమెడ్‌గా లభ్యం కావడంతో వ్యాపారాలు తగ్గాయని వడ్రంగులు వాపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమంలో భాగంగా యూకేజీ నుంచి ఒకటో తరగతిలోకి వెళ్తున్న చిన్నారులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పిడియాట్రిక్ వైద్యులు అనూష చలసాని పట్టాలు అందజేశారు. పట్టాలు చేతబూని గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో ఉన్న తమ పిల్లలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష చలసాని మాట్లాడుతూ.. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో వారి ఆరోగ్యం పట్ల కూడా అంతే శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్, సెయింట్ జాన్స్ విద్యా సంస్థల ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్, ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నగరంలో వివిధ ప్రాంతాలలో మద్యం తాగి వాహనాలు నడిపిన 99 మందికి న్యాయమూర్తులు లెనిన్‌బాబు, ఆర్‌వీ శర్మ జరిమానా విధించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో 1, 2, 5వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో 13 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, మరో 86 మందిలో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీపీ రాజశేఖరబాబు తెలిపారు.

మహిళా చైతన్యంతోనే సమాజ అభ్యున్నతి



మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ వెంకటరమణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలోని ప్రతి మహిళ విద్యావంతురాలై సాధికారత సాధించినప్పుడే సమాజ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏపీహెచ్ ఈఆర్ అండ్ ఎంసీ చైర్మన్ ఎం.వెంకటరమణ అన్నారు. కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రారంభోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ.. మహిళ ప్రతి కుటుంబానికి వెన్నెముక అని, మహిళ ఆర్థికంగా ఎవరి మీద ఆధారపడాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. విద్యావ్యవస్థను వ్యాపార దృక్పథంతో కాకుండా సమాజ సేవగా నిర్వహించాలని సూచించారు. కేబీఎన్ కళాశాల యాజమాన్యం చేస్తున్న సేవలను కొనియాడారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ దిగువ మధ్యతరగతి కుటుంబాలకు తమ కళాశాల పూర్తిగా అండగా ఉంటుందన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మహిళ ప్రస్తుత సమాజంలో వంటింటి నుంచి అంతరిక్షం దాకా ప్రజారంగంలోనూ పురుషులను మించి విజయాలు సాధిస్తోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ అధ్యక్షత వహించారు. ఉమెన్ స్టడీ సెంటర్ ఇన్‌చార్జి పి.స్వప్న, అధ్యాపకులు గౌతమీ దేవి, స్వాతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం



విశేష అలంకరణలో స్వామి అమ్మవార్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో తీసుకువచ్చి కల్యాణ వేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చకస్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞోపవీతధారణ, జీలకర్ర బెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం..

స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం ప్రత్యేక అలంకారం చేశారు. సహస్రనామార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాల అందజేత



మెడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రతిభ గల పేద విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిశోర్ మాట్లాడుతూ.. చదువు మనిషిని విజ్ఞానవంతుడిని చేస్తుందన్నారు. విద్య ద్వారానే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. నేడు మహనీయులుగా మనం కీర్తిస్తున్న ఎందరో మహానుభావులు నాడు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారన్నారు. ఉపాధ్యక్షుడు త్రినాథ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నదే తమ లక్ష్యమని, అందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. సెక్రటరీ సుందర్ రెడ్డి, డైరెక్టర్ మద్దినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. మట్టిలోని మాణిక్యాన్ని వెలికితీసి సాన పడితేనే దానికి గుర్తింపు ఉంటుందన్నారు. అదే విధంగా చదువే లక్ష్యంగా కష్టపడి చదువుకునే చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయుడు నెహ్రూ చొరవతో ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూసఫ్, క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీ సిల్టింగ్ ప్రక్రియ నిరంతరం జరగాలి



వన్‌టౌన్‌లోని డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో డీ సిల్టింగ్ పనులు ఎప్పటికప్పుడు జరుగుతూ ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన వన్ టౌన్, డ్రెయిన్ వీధి, సుబ్బరామయ్య వీధి, నెహ్రూ రోడ్డు, బాబూ రాజేంద్ర ప్రసాద్ రోడ్డు, గాంధీజీ మహిళా కళాశాల అన్న క్యాంటీన్, ఎంజీ రోడ్డు, ఈట్ స్ట్రీట్ ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వర్షపు నీటి నిల్వలు రోడ్డు మీద ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్ వీధి, వన్ టౌన్‌లోని డ్రెయిన్లను పరిశీలించి అక్కడున్న ఫ్లోటింగ్ వ్యర్థాలు, డిసిల్టింగ్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని చెప్పారు. ఎంజీ రోడ్డు ఈట్ స్ట్రీట్‌లో పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. నిత్యం తినుబండారాలు విక్రయాలు జరిగే ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎంతో ముఖ్యమని అందుకు అనుగుణంగా అధికారులు ఎప్పటికప్పుడు పరిశుభ్రమైన వాతావరణం ప్రజలకు కల్పించాలన్నారు. ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

- విజయవాడకల్చరల్: సాహిత్య, సాంస్కృతిక కళారంగాలకు ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ పెద్దపీట వేస్తోందని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. ఎక్స్‌రే సంస్థ ఆధ్వర్యంలో 2025వ సంవత్సంలో కూటమి ప్రభుత్వంలో ఉగాది, కళారత్న పురస్కారాలు అందుకున్న ఎక్స్‌రే సభ్యులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని మంగళవారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయంలో నిర్వహించారు.

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం



యోగాసనం వేస్తున్న యోగ సాధకుడు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనిషి జీవితంలో ఏదో ఒక రకంగా మానసిక ఒత్తిడికి గురవుతారని, దానిని అధిగమించేందుకు యోగా ఒక్కటే మార్గమని నగరపాలకసంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అన్నారు. అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేసవి ఉచిత యోగ శిక్షణ శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచే యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. శరీరానికి, మనసుకు మధ్య సమతుల్యానికి యోగా దోహదపడుతుందని, తద్వారా ఆరోగ్యకర జీవితాన్ని గడపవచ్చని చెప్పారు. ప్రపంచ మానవాళికి మన దేశం ఇచ్చిన కానుక యోగా అన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. అనారోగ్య సమస్యల పరిష్కారానికి సహజ సిద్ధమైన సులభ మార్గం యోగా విద్య అన్నారు. దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని సూచించారు. యోగా దినచర్యగా మారినప్పుడు ఔషధాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

వేల మందికి యోగా శిక్షణ..

అమరావతి యోగా, యేరోబిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీ రమణ మాట్లాడుతూ.. 2017 నుంచి ప్రతి ఏటా వేల మందికి ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. తొలుత మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర యోగా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో కలిసి యోగాసనాలను వేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి, ఇన్‌స్పెక్టర్ దాసరి కాశీ విశ్వనాథ్, సీహెచ్ అరుణ్ కుమార్, అసోసియేషన్ కోశాధికారి ఏ.లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పి.ప్రశాంత్‌కుమార్, కె.గాంధీ బాబు, విశ్రాంత డీసీపీ టి.హరికృష్ణ, అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, యోగా కోచ్ ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు.

కోర్టు ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విజయవాడలీగల్: స్థానిక కోర్టు ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రాన్ని 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.సత్యానంద్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టుకు వచ్చే కక్షిదారుల సౌకర్యార్థం వేసవిలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, బెజవాడ బార్ అసోసియేషన్‌ను అభినందించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జనరల్ సెక్రటరీ షరీఫ్ మాట్లాడుతూ 1986వ సంవత్సరములో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్‌ను ఏర్పాటు చేశామని, గత 20 సంవత్సరాలుగా ప్రతి వేసవి కాలంలో కోర్టు ప్రాంగణంలో రెండు నెలలపాటు రోజూ వెయ్యి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సంవత్సరమంతా దాహార్తిని తీర్చేందుకు మంచినీటిని అందజేస్తున్నామన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా మాట్లాడుతూ.. బీబీఏ, ఐఏఎల్ ఆధ్వర్యంలో 21 సంవత్సరాలుగా మజ్జిగ చలివేంద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీబీఐ, ఏసీబీ కోర్టు న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు, బీబీఏ ప్రధాన కార్యదర్శి కె.వి.రంగారావు, బీబీఏ గవర్నింగ్‌బాడీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.